క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దొనకొండ: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

కాపునాడు సమస్యలు పరిష్కరించేలా కృషి


కిశోర్‌బాబుతో కాపు నాయకులు

పెద్దదోర్నాల: రాష్ట్రంలోని కాపునాడు సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతు కిశోర్‌బాబు పేర్కొన్నారు. గురువారం శ్రీశైలం వెళ్తూ మండల కేంద్రంలోని బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపంలో ఆయన్ను స్థానిక కాపు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు యామా దాసయ్య, చల్లా సురేష్, రామిరెడ్డి కృష్ణ, పండు కలిశారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ


వసంతరావు నాయక్, ఎంపీడీఓ

దొనకొండ: స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా వి.వసంతరావు నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పుల్లలచెరువు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ దొనకొండకు బదిలీపై వచ్చారు. దొనకొండలో ఇప్పటి వరకు ఎంపీడీఓగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎం.శ్రీదేవి బదిలీపై వెళ్లారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీఓగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు డిప్యూటీ ఎంపీడీఓ

దొనకొండ: దొనకొండ మండల ఉప అభివృద్ధి అధికారిగా బి.శ్రీనివాసరావు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నుంచి బదిలీపై దొనకొండకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న షేక్ ఆదాముషఫీ గుంటూరుకు బదిలీపై వెళ్లారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని శ్రీనివాసరావు తెలిపారు.

ఫ్లోరోసిస్ నివారణపై అవగాహన

పొదిలి: స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం ఫ్లోరోసిస్ నివారణ, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన సమావేశం నిర్వహించారు. డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ.. ఫ్లోరోసిస్ లక్షణాలు, ముందస్తు జాగ్రత్తలు, నివారణ, వైద్య సేవల గురించి వివరించారు. ముందుగా సిబ్బంది అవగాహన కలిగి ఉండి, ప్రజలకు జాగ్రత్తల గురించి తెలియజెప్పాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ వి.అనిల్‌కుమార్, ఎల్‌టీ అంజిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ లేళ్ల శ్రీనివాసరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినికి అభినందన

పొదిలి: ఇంటర్మీడియెట్ బైపీసీ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో 437/440 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మహ్మద్ తహీరా ఫాతిమాను స్థానిక వివేకానంద కళాశాల యాజమాన్యం కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు అభినందించారు. విద్యుత్ ఏడీఈ హరిబాబు, కార్యాలయ సిబ్బంది ఫాతిమాను సన్మానించి, రూ.5 వేల ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా మార్కులు పొంది, తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

నేడు రెవెన్యూ డే ర్యాలీ

బేస్తవారిపేట: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జితేంద్రకుమార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొనాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించండి

అర్ధవీడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరును పెంచేందుకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంఈఓ–2 లక్ష్మీనాయక్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. కాగా పాపినేనిపల్లి గ్రామంలో స్పెషల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సలోమి, ఉపాధ్యాయులు గురువారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.



బైకులతో యువకుల

వికృతానందం

- భారీ శబ్దాలతో పాదచారులకు మానసిక ఆందోళన
- చర్యలు తప్పవంటున్న పోలీసులు

పెద్దదోర్నాల: మండలంలో కొందరు యువకులు తమ బైకులకు పొగ గొట్టాలను మార్చి తద్వారా వచ్చే శబ్ద కాలుష్యంతో వికృతానందం పొందుతున్నారు. ఇది పాదచారులకు ఇబ్బంది కలిగిస్తోంది. మండల కేంద్రంతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన నేషనల్ హైవేలోని పలు ప్రాంతాల్లో ఇంజన్ సామర్థ్యం పెద్దదిగా కలిగిన ద్విచక్ర వాహనాలకు భారీగా శబ్దాలు వచ్చే సైలెన్సర్‌లను అమర్చి తిరుగుతున్నారు. ఇలా చేయటం మోటారు వాహనాల చట్టం ప్రకారం నిషేధం. వాహనాలతో వచ్చే అధిక శబ్దంతో చాలా మంది ప్రజలు పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. డబ డబ శబ్దం చేస్తూ పక్క నుంచి బైక్ దూసుకెళ్తుంటే పాదచారుల గుండెల్లో దడ పుడుతోంది.

శబ్ద కాలుష్యంతో ఎన్నో అనర్థాలు

శబ్ద కాలుష్యంతో వినికిడి ఇతర ఆరోగ్య సమస్యలు మానసిక ఆందోళనలు తలెత్తే ప్రమాదం ఉంది. ఆటోల్లో సౌండ్ బాక్సులు ఏర్పాటు చేసుకుని మితి మీరిన శబ్దాలతో ప్రయాణించటం నేరం. ముఖ్యంగా గుండె జబ్బులు ఉన్న వారు ఇటాంటి పెద్ద శబ్దం ఒక్కసారిగా వచ్చినప్పుడు విని ఆందోళన చెందుతున్నారు. రోడ్డు మీద పక్క నుంచి భారీ శబ్దంతో దూసుకెళ్తుంటే ఇతర వాహనదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నట్లు ఉంటుంది. దీంతో పాటు మరి కొందరు ఉలిక్కి పడి తొట్రుపాటుకు గురయ్యే ప్రమాదం ఉంది.

అవగాహన అవసరం

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వాహనదారులకు అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది. దీంతో పాటు వాహనాల నంబర్ ప్లేట్లపై సినిమా హీరోల బొమ్మలతో పాటు రాజకీయ నాయకుల బొమ్మలు వేసుకుని వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. శబ్ద కాలుష్యం చేస్తున్న వారి ద్విచక్ర వాహనాల పొగ గొట్టాలను స్వాధీనం చేసుకుని వారికి శబ్ద కాలుష్యంపై అవగాహన కల్పించాల్సి ఉంది.

శబ్ద కాలుష్యానికి పాల్పడితే చర్యలు



“యువత మోటారు వాహనాలకు మార్చిన పొగ గొట్టాలను (మోడిఫైడ్ సైలెన్సర్) వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మోడిఫైడ్ సైలెన్సర్‌లతో వాహనాలు నడుపుతున్న ఇతర ప్రాంతాలకు చెందిన యువకులకు అవగాహన కల్పిస్తున్నాం. దీంతో పాటు వాహనాలకు సంబంధించిన నంబరు పేట్లపై, నంబరు కాకుండా సినిమా, రాజకీయ నాయకులు ఫొటోలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆటోల్లో సౌండ్ బాక్సులు ఏర్పాటు చేసుకుని మితి మీరిన శబ్దాలతో ప్రయాణించటం నేరం. అలా చేసే వారిపై చర్యలు తీసుకుంటాం.”

– మహేష్, ఎస్సై, పెద్దదోర్నాల

విద్యార్థుల క్రమశిక్షణ టీచర్ల బాధ్యత

మార్కాపురం టౌన్:

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు నిత్యం పర్యవేక్షించాలని మార్కాపురం రూరల్ ఇన్‌చార్జి ఎస్సై రాజమోహన్‌రావు సూచించారు. గురువారం మండలంలోని రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తనపై అనుమానం వస్తే తక్షణమే కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజమోహన్‌రావు

విద్యార్థుల తల్లిదండ్రులను కూడా పాఠశాలకు పిలిపించి సమాచారం తెలియజేయాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలు అవగాహన కలిగి ఉండాలని, అసభ్యకరంగా ప్రవర్తించే వారి సమాచారం టీచర్లతోపాటు పోలీసులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకునేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనం పెంచాలి.. సమస్యలు తీర్చాలి

- మార్కాపురంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

మార్కాపురం టౌన్: ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీ తర్వాత నుంచి సమ్మెకు దిగుతున్నారని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో కాంట్రాక్టు కార్మికులు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తల్లికి వందనంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలన్నారు. జీఓఎంఎస్ నం.36 ప్రకారం వేతనాన్ని వెంటనే పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కార్మికుల వారసులకు ఉద్యోగం ఇవ్వాలని, సమాన పనికి సమానవేతనం అమలు చేయాలన్న దీర్ఘకాల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని వేతనం పెంచకుంటే, మున్సిపల్ కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి రూబెన్, మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్ష్య కార్యదర్శులు సుబ్బరాయుడు, హరికృష్ణ, ఇమాంసా, నాయకులు సలాంఖాన్, చెన్నకేశవులు, సమ్మద్, కనకయ్య, శివ, యుసఫ్, శ్రీను పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి


స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ మాధవరావు

మార్కాపురం టౌన్: మార్కాపురం రవాణాశాఖ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యజమానులు తమ బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకుని, సర్టిఫికెట్లు పొందాలని ఎంవీఐ మాధవరావు సూచించారు. జిల్లా ఉప రవాణా అధికారి ఆదేశాల మేరకు గురువారం మార్కాపురంలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్సుల్లో ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్, మెడికల్ కిట్, ఫైర్ సిలిండర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. తనిఖీల సమయంలో కిట్లు లేనట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కూల్ బస్సుల డ్రైవర్లకు రోడ్డు ప్రమాదల నివారణపై సూచనలిచ్చారు.

3 రోజులపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం సబ్ స్టేషన్ ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం శుక్ర, శని, ఆదివారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక విద్యుత్‌శాఖ డీఈఈ బి.శేషగిరిరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంబవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. 20 వ తేదీన ఉయ్యాలవాడ సబ్ స్టేషన్, సంజీవరాయుడుపేట సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా ఆయా గ్రామాల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని డీఈఈ కోరారు.

బైకులు ఢీ.. నలుగురికి గాయాలు

రాచర్ల: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం రాచర్ల మండలంలోని అనుములపల్లె గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. జేపీ చెరువు గ్రామానికి చెందిన చెదులూరి రమణారెడ్డి తన బైక్‌పై గిద్దలూరు వెళ్లి స్వగ్రామానికి వస్తున్నాడు. చోళ్లవీడు గ్రామానికి చెందిన రమణ, నెమిలిగుండం, దానమయ్య కలిసి బైక్‌పై గిద్దలూరు వెళ్తున్నారు. ఈ క్రమంలో అనుములపల్లె సబ్‌స్టేషన్ సమీపంలో మూలమలుపు వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో జేపీ చెరువు గ్రామానికి చెందిన చెదులూరి రమణారెడ్డి తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. మరో బైక్‌పై ఉన్న ముగ్గురికీ స్వల్పగాయల య్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. రమణారెడ్డిని మెరుగైన వైద్యం కోసం నంద్యాల తరలించినట్లు సమాచారం. సంఘటనా స్థలాన్ని ఏఎస్సై ఆదిశేషయ్య పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


తీవ్రంగా గాయపడిన రమణారెడ్డి

సమానత్వమే సాయితత్వం


ప్రవచనకర్తను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో షిరిడీ సాయిబాబా మందింలో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా సాయిసత్‌చరిత్రపై రిటైర్డ్ ఈఈ ఎల్‌వీ సుబ్రమణ్యంరెడ్డి ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. సాయినాథుడు సర్వదేవతా స్వరూపుడని పేర్కొన్నారు. ప్రతి రోజు భిక్షాటన చేసి సర్వజీవులకు ఆహారం పంచేవారన్నారు. ఆలయ కార్యదర్శి గోపాలుని హరిహరరావు మాట్లాడుతూ.. ఈ నెల 25వ తేదీ వరకు రోజూ ప్రముఖ వక్తలతో సాయిచరిత్రపై ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రామడుగు గోపి, కోశాధికారి నాగరాజు, కమిటీ సభ్యులు గోపాలుని కృష్ణమోహన్, కరీం, పవన్, విజయ్, మహిళా సంఘ సభ్యులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సాయిసత్‌చరిత్ర పారాయణం చేశారు.


ఎమ్మెల్యే బూచేపల్లిని సత్కరిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే బూచేపల్లికి నేతల కృతజ్ఞతలు

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని బుధవారం రాత్రి ఆయన నివాసంలో మండల స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు కై పు అశోక్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూలమాల వేసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బూచేపల్లి సూచించినట్లు పేర్కొన్నారు. వీరి వెంట జిల్లా సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడు ఇంద్రాసేనారెడ్డి, మండల నాయకులు జనార్దన్, షేక్ కాలేషా ఉన్నారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన


ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

తాళ్లూరు: సికిల్ సెల్ అనీమియా వ్యాధి వారసత్వంగా వస్తుందని, ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్లు మౌనిక, శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్థానిక తూర్పు గంగవరం ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో గురువారం సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ వ్యాధి లక్షణాల గురించి వివరించారు. ఇది హిమోగ్లోబిన్ అనే ప్రోటీన్ నుంచి వస్తుందని, వ్యాధి ఉన్న వారు ద్రవ రూపంలోనే ఆహారం తీసుకోవాలని, వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. చేతులు, కాళ్లు, వెన్నునొప్పి, పొత్తికడుపు నొప్పి వస్తుందని చెప్పారు. శ్వాస తీసుకోవడం ఇబ్బంది పడేవారు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. హెచ్‌ఈఓ చంద్రశేఖర్‌రావు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో భక్తుల పూజలు

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్లలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తిశ్రద్ధలతో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి హారతులు ఇచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

మలేరియాపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

దర్శి (కురిచేడు): మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా దర్శి నియోజకవర్గ మలేరియా అధికారి ఎస్.బసవారెడ్డి గురువారం మండలంలోని రాజం పల్లి, కొత్తపల్లి, కొర్లమడుగు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం ఇంట్లోని నీటితొట్లు, ట్యాంకులు ఎండబెట్టాలని సూచించారు. దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని, దోమలు పుట్టకుండా చూసుకోవటమే అందరి బాధ్యతన్నారు. ఏఎన్‌ఎంలు అంజలి, కరుణ, మల్లేశ్వరి, హెల్త్ అసిస్టెంటు జ్యోతిబాబు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్ర హాజరు పెంచేందుకు తంటాలు

బేస్తవారిపేట:

యోగాంధ్ర హాజరు శాతం తక్కువగా ఉండటం, సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేయడం కోసం సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు నానా తంటాలు పడుతున్నారు. హాజరు 50 శాతం కంటే తక్కువగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు ఎంపీడీఓ కార్యాలయం వద్ద తమ మొబైల్ ఫోన్లతో కుస్తీలు పడుతున్నారు. ప్రభుత్వం పబ్లిసిటీ యావతో ఉద్యోగులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచుతోందని ఓ వైపు నిరసన వ్యక్తం చేస్తూనే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్న పరిస్థితి గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో నెలకొంది. కొందరు ఉద్యోగులకు యాప్‌లో వివరాలు నమోదు చేయడంపై అవగాహన లేకపోవడంతో నేర్చుకునే పనిలో పడ్డారు. ఆన్‌లైన్‌లో యోగా అటెండెన్స్ పెంచడంతోపాటు హాజరు వేసినవారికి సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేయడంతో సచివాలయ ఉద్యోగులు అదే పనిలో పూర్తిగా నిమగ్నమయ్యారు.